సాక్షి విశాఖపట్నం

సోమవారం । 25 । ఆగస్టు । 2025


ఉక్కు కార్మికుల తొలగింపు దారుణం 8లో


రాగాల సంగమం 8లో


పాలిటెక్నిక్‌లో వసతి వెతలు 8లో

ఓ మట్టి గణపయ్యా





పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ లాసన్స్‌బే కాలనీలో పిల్లలు మట్టి గణపతి విగ్రహాలను తయారు చేశారు. వినాయక చవితి పండగ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మట్టి గణపతి విగ్రహాలను పూజించడం వల్ల పర్యావరణానికి ఎటువంటి హాని కలగదు. రసాయన రంగులతో తయారు చేసిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీటి కాలుష్యం పెరుగుతుందని, వాటిని నిమజ్జనం చేసినప్పుడు సాగరతీరాల్లో జీవరాశులకు ప్రమాదం కలుగుతుందని, అందుకే అందరూ మట్టి గణపతులను పూజించాలని చిన్నారులు పిలుపునిచ్చారు. -ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మెగా పేరిట దగా..

- మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులకు కూటమి మోసం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



సాక్షి,విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసి నిరుద్యోగులను మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆరోపించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'దగా డీఎస్సీ' నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ 45,000 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పి, ఇప్పుడు కేవలం 16,000 పోస్టులతో సరిపెట్టడం దారుణమని కేకే రాజు అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 1998 డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 4,534 మందికి, 2008 డీఎస్సీ ద్వారా 2,193 మందికి, 2018 డీఎస్సీ ద్వారా 7,676 మందికి ఉద్యోగాలు కల్పించిందని ఆయన గుర్తు చేశారు. అలాగే 2022లో 502 టీచర్ పోస్టులను కూడా భర్తీ చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2024లో 6,100 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించగా, ఎన్నికల ముందు దానిని కూటమి పార్టీలు కుట్రపూరితంగా కోర్టు కేసులతో ఆపేశారని కేకే రాజు ఆరోపించారు. ఇప్పుడు అదే నోటిఫికేషన్ రద్దు చేసి 'మెగా డీఎస్సీ' పేరుతో మోసం చేశారని, డిసెంబర్ లోపు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదని విమర్శించారు.అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్ ఇవ్వకపోతే తన కాలర్ పట్టుకొని అడగమని గతంలో లోకేష్ సవాల్ విసిరారని, ఇప్పుడు ఏడాది అయినా జాబ్ క్యాలెండర్ ఎక్కడ అని ఆయన ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం → 8లో ← ఇండిగో చక్కర్లు

స్ప్రీతో కార్మికుల జీవితాలకు మరింత ధీమా

- నమోదు చేసుకోని సంస్థలకు సువర్ణావకాశం
- ఈఎస్ఐసీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌కే సాహూ



తాటిచెట్లపాలెం: కేంద్ర కార్మిక, ఉపాధి శాఖకు చెందిన కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐ)లో అర్హులైన సంస్థలు, కర్మాగారాలు తమను తాము నమోదు చేసుకోవాలని విశాఖ ఈఎస్ఐసీ ఉప ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ (ఇన్‌చార్జి) సౌమేంద్ర కుమార్ సాహూ తెలిపారు. నరసింహనగర్‌లోని ఈఎస్ఐ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు.

ప్రయోజనాలు

ఈఎస్ఐ చట్ట పరిధిలో ఉన్నప్పటికీ, ఇంతవరకు నమోదు చేసుకోని సంస్థల కోసం 'స్కీం ఫర్ ప్రమోషన్ ఫర్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయిస్'(స్ప్రీ) పథకాన్ని ఈఎస్ఐ తిరిగి ప్రారంభించింది. ఈ పథకం జూలై 1, 2025 నుంచి డిసెంబరు 31, 2025 వరకు అమలులో ఉంటుంది. ఈ పథకం కింద నమోదు చేసుకునే సంస్థలకు గత బకాయిల నుంచి మినహాయింపు లభిస్తుంది.

గత బకాయిల నుంచి మినహాయింపు

సాధారణంగా ఈఎస్ఐలో నమోదు చేసుకున్న సంస్థలు గత ఐదేళ్ల బకాయిలు, వడ్డీ, నష్టపరిహారంతో సహా చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈ పథకం ద్వారా నమోదు చేసుకుంటే ఈ భారం నుంచి మినహాయింపు పొందొచ్చు.

పాత బకాయిలు, తనిఖీలు ఉండవు

ఈ పథకంలో నమోదు చేసుకున్న తేదీ కంటే ముందు సమయానికి సంబంధించిన చందాలు కట్టనవసరం లేదు. అలాగే ఈఎస్ఐ కూడా గత సమయానికి సంబంధించిన క్లెయిములు, తనిఖీలు చేయదు.

నమోదుకాని ఉద్యోగుల నమోదు

ఇప్పటికే ఈఎస్ఐలో నమోదు చేసుకుని, ఇంకా కొంతమంది ఉద్యోగులను నమోదు చేయని సంస్థలు ఈ పథకం ద్వారా వారిని చేర్చుకోవచ్చు. వారికి కూడా నమోదు చేసిన తేదీ నుంచి చందా, ఇతర ప్రయోజనాలు వర్తిస్తాయి.

ఈఎస్ఐ పరిధి, ప్రయోజనాలు

కార్మిక రాజ్య బీమా సంస్థ అసంఘటిత రంగ కార్మికులకు ఆర్థిక, ఆరోగ్య భద్రత కల్పిస్తుందని అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్యాంప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 22.24 లక్షల కర్మాగారాలు, సంస్థలు ఈ పథకం కింద నమోదయ్యాయి, వీటిలో 3.72 కోట్ల కార్మికులు ఉన్నారు.

ఎవరు అర్హులు?

10 లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులు ఉన్న ఏ కర్మాగారాలు లేదా సంస్థలైనా ఈఎస్ఐ చట్ట పరిధిలోకి వస్తాయి. వీటిలో సినిమా హాళ్లు, రవాణా సంస్థలు, ప్రింటింగ్ ప్రెస్‌లు, వార్తా సంస్థలు, హోటళ్లు, రెస్టారెంట్లు, దుకాణాలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆసుపత్రులు, పెట్రోల్ బంకులు, సెక్యూరిటీ ఏజెన్సీలు మొదలైనవి ఉంటాయి.

ఎవరెవరికి లాభం

వర్క్‌మెన్ కాంపెన్సేషన్ చట్టం, 1923, మెటర్నిటీ చట్టం, 1961 నుంచి మినహాయింపు లభిస్తుంది. ఉద్యోగుల వైద్య ఖర్చుల బాధ్యత నుంచి ఉపశమనం లభిస్తుంది. కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు సంపూర్ణ ఆరోగ్య భద్రత లభిస్తుంది. అనారోగ్యం, ప్రసవం, ఉద్యోగ సంబంధిత ప్రమాదాలు, వైకల్యం వంటి సందర్భాల్లో ఆర్థిక సహాయం అందుతుంది.

చందా వివరాలు

నెలసరి వేతనం రూ. 21,000 లేదా అంతకంటే తక్కువ ఉన్న కార్మికులకు ఈఎస్ఐ వర్తిస్తుంది. దివ్యాంగులకు ఈ పరిమితి రూ. 25,000. కార్మికుల వాటా మొత్తం వేతనంపై 0.75 శాతం ఉంటుంది. మొత్తం వేతనంపై 3.25 శాతం ఉంటుంది. ఈ రెండు వాటాలను కలిపి ప్రతి నెలా 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలి. రూ. 176 లేదా అంతకంటే తక్కువ దినసరి వేతనం పొందే కార్మికులకు చందా మినహాయింపు ఉంటుంది, కానీ యజమాని వాటా చెల్లించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాల కోసం నరసింహనగర్‌లోని ఉప ప్రాంతీయ కార్యాలయాన్ని లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1800-11-2526ను సంప్రదించవచ్చు.



'స్ప్రీ' కరపత్రికను విడుదల చేస్తున్న ఈఎస్ఐసీ ఉప ప్రాంతీయ కార్యాలయం అధికారులు

యూరియా కొరత

రైతు కలత

కూటమి దొంగాట

- సరిపడా నిల్వలు లేనప్పటికీ ఉన్నట్లు ప్రకటనలు
- క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు పడుతున్న రైతులు
- యూరియా, డీఏపీ కోసం రైతులు పడిగాపులు
- అధికారుల లెక్కల్లో యూరియా 1648, డీఏపీ 694 మెట్రిక్ టన్నులు



యూరియా గోదాము

మహారాణిపేట: యూరియా, ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్షేత్ర స్థాయిలో నిల్వలు లేక రైతులు పడిగాపులు పడుతుంటే, అధికారులు మాత్రం సరిపడా యూరియా అందుబాటులో ఉందని చెబుతున్నారు. నానో యూరియాను రైతులకు అంటకట్టడానికి ఆలోచనతో కూటమి సర్కార్ యూరియాను కృత్రిమ కొరతను సృష్టిందన్న విమర్శలు వస్తున్నాయి.

నానో యూరియాపై ఒత్తిడి

ఖరీఫ్ సీజన్ ముమ్మరంగా సాగుతున్న ఈ సమయంలో యూరియా చాలా అవసరం. జిల్లాలో 1,648 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, అది లభించక రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇదే సమయంలో నానో యూరియాను కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారులు, సహకార సంఘాలపై ఒత్తిడి తీసుకువస్తున్నారని రైతులు వాపోతున్నారు. నానో యూరియా పిచికారీ చేయడానికి రైతులు వెనుకాడుతుండగా, అధికారులు డ్రోన్లను అందుబాటులోకి తెస్తున్నామని చెబుతున్నారు. అయితే డ్రోన్‌ల వినియోగానికి అదనపు ఖర్చు అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. యూరియా రాకపోవడం, సహకార సంఘాల వద్ద యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. జిల్లాకు యూరియా, డీఏపీ ఎరువులు చేరినట్టు అధికారులు లెక్కలు చెబుతున్నారు. కాని క్షేత్ర స్థాయిలో ఇవి చేరకకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడ నానో యూరియా అమ్మకాలు పెంచాలని, ఇటు వ్యవసాయ అధికారులకు, అటు కూటమి సర్కార్ మీద ఒత్తిడి తెస్తోంది. యూరియా విక్రయిస్తున్న సహకార సంఘాలు, రైతు

మిగతా 8వ పేజీలో ▶

ఖరీఫ్ సీజన్‌కు యూరియా అవసరం..	ఇప్పటి వరకు పంపిణీ చేసింది
3,200 మెట్రిక్ టన్నులు	1648 టన్నులు

ఆ జ్ఞాపకాల వీధుల్లో

బాల్యం పరుగు

గోపాలపట్నం హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గోలీలు ఆడుతూ..



1992-93 బ్యాచ్ విద్యార్థులు



కర్రాబిళ్ల ఆడుతూ..


గోపాలపట్నం: స్థానిక బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం ఆదివారం సందడిగా మారింది. తమ బాల్యాన్ని తలచుకుంటూ, బరువైన బాధ్యతలను పక్కన పెట్టి, 1992-93 పదో తరగతి బ్యాచ్‌మేట్స్ తమ పాఠశాలకు చేరుకున్నారు. సుమారు 150 నుంచి 200 మంది విద్యార్థుల అపూర్వ కలయికతో ఆ ప్రాంగణం నవ్వులతో, పాత జ్ఞాపకాలతో నిండిపోయింది. బాల్యంలోని అమాయకత్వంతో, వారు మళ్లీ చిన్న పిల్లలుగా మారిపోయారు. చేతికి జీరు బెల్లంతో తయారు చేసిన వాచీలు, ఉంగరాలు వేసుకుని ఒకరికొకరు చూసుకుని మురిసిపోయారు. గోలీల ఆటలు, టైరు బండి, తాటికాయల బండి, కర్రాబిళ్లా ఆడుతూ నాటి తీపి అనుభూతులను మరోసారి ఆస్వాదించారు. చిన్నతనంలోని చిరుతిండ్లను ప్రదర్శనకు ఉంచి, వాటిని తింటూ ఆనాటి రుచులను గుర్తు చేసుకున్నారు.ఈ సమావేశం అల్లరి అల్లరిగా, ఉత్సాహంగా సాగింది. ఒకరినొకరు నాటి జ్ఞాపకాలను పంచుకుంటూ నవ్వుకున్నారు. 'అప్పుడు బద్ధ శత్రువులం, ఇప్పుడు ప్రాణ స్నేహితులం' అంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆపైన నృత్యాలు, విందు వినోదాలతో కార్యక్రమం ముగిసింది. పాఠశాల వదిలి వెళ్లినా, తరగని తమ స్నేహబంధానికి, బాల్యపు జ్ఞాపకాలకు ఈ అపూర్వ కలయిక ఒక నిలువుటద్దంగా నిలిచిపోయింది.



బొమ్మల మిఠాయిలతో ఉంగరాలు..

తినోళ్లకు తిన్నంత

అనారోగ్యం



తో ఆగిపోయా... అంటిసా పట్టని 'ఫుడ్‌సేఫ్టీ' యోగంగా మారింది...

ఆహార తనిఖీ కేంద్రంలో సిబ్బంది కొరత

- తనిఖీలు, పరీక్షలు లేకపోవడంతో విచ్చల వీడిగా కల్తీ ఆహారం అమ్మకాలు
- మూలకు చేరిన మొబైల్ ఆహార పరీక్షల వాహనం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



జిల్లా ఆహార తనిఖీ కార్యాలయం

బీచ్‌రోడ్డు: ఆహార భద్రత సూచికలో ఆంధ్రప్రదేశ్ చివరి స్థానంలో కొనసాగుతుండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. క్షేత్ర స్థాయిలో నిఘా, పర్యవేక్షణ లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. జిల్లాల్లోని ఆహార తనిఖీ కార్యాలయాలు, పరీక్షా కేంద్రాల్లో సిబ్బంది లేకపోవడంతో కల్తీ ఆహారం విచ్చలవిడిగా అమ్ముడవుతోంది. ఇటీవల జరిగిన తనిఖీల్లో 85 శాతం హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల్లో నాసిరకం, కల్తీ ఆహారం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోంది.

ప్రాంతీయ కేంద్రాల్లో సిబ్బంది కొరత

జిల్లాలో ఆహార భద్రతా వ్యవస్థ సంక్షోభంలో ఉంది. పెదవాల్తేరులోని జిల్లా ఆహార తనిఖీ కార్యాలయంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. అవగాహన కార్యక్రమాలు, రెస్టారెంట్లు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు సరిపడా లేరు. అంతేకాకుండా, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ వంటి కీలక పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. పెదవాల్తేరులోని ప్రాంతీయ ఆహార పరీక్షల కేంద్రంలో ఎప్పటి నుంచో ఆహార పరీక్షలు నిలిచిపోయాయి. గత నెల వరకు జరుగుతున్న నీటి పరీక్షలు కూడా సిబ్బంది బదిలీ కావడం



రీజనల్ ఆహార పరీక్షల కేంద్రం

నిరుపయోగంగా కోట్ల విలువైన పరికరాలు

ప్రజారోగ్యం కోసం గత ప్రభుత్వం సుమారు రూ. 110 కోట్లు కేటాయించి, కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుని రాష్ట్రవ్యాప్తంగా మూడు ఆహార పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో అత్యాధునిక రాష్ట్ర ఆహార పరీక్షా కేంద్రాన్ని నిర్మించి, సుమారు రూ. 10 కోట్ల విలువైన పరికరాలను ఏర్పాటు చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన ఈ కేంద్రానికి 70 మంది సిబ్బందిని నియమించాల్సి ఉంది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా ఈ పోస్టుల భర్తీని చేపట్టకపోవడంతో కోట్ల విలువైన పరికరాలు నిరుపయోగంగా మూలకు చేరాయి.

మూలకు చేరిన వాహనం

గత ప్రభుత్వం కల్తీపై నిఘా పెట్టేందుకు రూ. 40 లక్షలతో కేటాయించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ మొబైల్ టెస్టింగ్ వాహనం కూడా కార్యాలయానికే పరిమితమైంది. ఈ వాహనంతో అవగాహన కల్పించడం కానీ, కల్తీ ఆహార నమూనాలను సేకరించడం కానీ జరగడం లేదు. దీనివల్ల రూ. 40 లక్షలు వృథాగా పోతున్నాయి.




మొబైల్ ఆహార పరీక్షల వాహనం

నగరంలో విచ్చలవిడిగా కల్తీ ఆహారం

ఆహార తనిఖీలు, పరీక్షలు నిర్వహించేందుకు సిబ్బంది లేకపోవటంతో జిల్లాలో కల్తీ ఆహారం విచ్చలవిడిగా అమ్మేస్తున్నారు. రెండు వారాల క్రితం నగరంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఆహార కల్తీలను చూసి అధికారులకు దిమ్మతిరిగింది. రెండు రోజుల పాటు నిర్వహించిన తనిఖీల్లో 85 శాతం కల్తీ ఆహారమే గుర్తించి ఆశ్చర్యపోయారు. పెద్ద పెద్ద హోటల్స్, రెస్టారెంట్స్, బేకరీలు కూడా కల్తీ ఆహారం విక్రయాలు జరుపుతోంది. ఆహార నాణ్యత పాటించకపోవడాన్ని గుర్తించారు. జిల్లాలో సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఆహార కల్తీని అరికట్టే అవకాశం ఉంటుంది.

రాష్ట్ర ఆహార పరీక్షల కేంద్రం



మండపాలకు బొజ్జ గణపయ్య..



కంచరపాలెం రైల్వే బ్రిడ్జ్ వద్ద రూపొందించిన విగ్రహాలను మండపాలకు తరలిస్తున్న యువకులు



మహానగరం గణపతి బప్పా మోరియా నామస్మరణతో మార్మోగేందుకు సిద్ధమవుతోంది. ఈ నెల 27న వినాయక చవితి నేపథ్యంలో నగరం పండగ శోభను సంతరించుకుంది. వీధివీధినా మండపాల నిర్మాణం, భారీ విగ్రహాల తరలింపు, మార్కెట్లలో కొనుగోళ్ల హడావుడితో కోలాహలం నెలకొంది. అక్కయ్యపాలెం, శంకరమఠం, మర్రిపాలెం, కంచరపాలెం, మధురవాడ, గాజువాక వంటి ప్రాంతాల్లోని విగ్రహ తయారీ కేంద్రాల్లో కళాకారులు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. కళాకారులు తాము తీర్చిదిద్దిన భారీ గణనాథులకు తుది మెరుగులు దిద్దుతూ.. రంగులు అద్దుతున్నారు. ఈ ఏడాది సంప్రదాయ రూపాలతో పాటు సినిమా థీమ్‌లతో, సామాజిక సందేశాలిచ్చే రూపాల్లోని విగ్రహాలు యువతను ఆకట్టుకుంటున్నాయి. ఇక ఉత్సవ కమిటీ సభ్యులు తమకు కావాల్సిన ఆకృతుల్లో తయారు చేయించిన భారీ విగ్రహాలను వాహనాల్లో మండపాలకు తరలించడం మొదలుపెట్టారు. భారీ గణపయ్యలు రోడ్లపై వెళ్తుంటే ప్రజలు ఆసక్తిగా తిలకించారు. గత కొన్నేళ్లతో పోలిస్తే ఈ సారి పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలకు ఆదరణ పెరగడం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



తుది మెరుగులు అద్దుతున్న కళాకారుడు



విగ్రహాల వద్ద పిల్లల సందడి

యూరియా కొరత.. రైతు కలత

▶7వ పేజీ తరువాయి

భరోసా కేంద్రాలకు లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. రైతుల నెత్తిన నానో యూరియా రుద్దడానికి వ్యవసాయ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

భీమిలి, పద్మనాభం వంటి ప్రాంతాల్లో యూరియా కొరత రోజురోజుకూ జటిలంగా మారుతున్నా, అధికారులు కానీ, అధికార యంత్రాంగం కానీ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు వేసిన తర్వాత ఎరువులు లేకపోవడంతో పంట దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉందని వారు భయపడుతున్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి



ఇప్పటికే వర్షాలు ఆలస్యంగా వచ్చాయి. రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఖరీఫ్, రబీ సీజన్‌లకు అనుగుణంగా విత్తనాలతో పాటు ఎరువులు, యూరియా సిద్ధం చేసేది. ఆ ఐదేళ్లూ ఎప్పుడూ రైతులు ఏ ఒక్క అవసరం కోసం ఎదురు చూడకుండా ప్రభుత్వమే సరఫరా చేసేది. విత్తు నుంచి ఎరువులు, గిట్టుబాటు ధరలు, బీమా వసతులు అన్నీ ప్రభుత్వమే చూసుకునేది. ముఖ్యంగా ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలి.

–కొల్లి అప్పారావు, ఆనందపురం

సకాలంలో ఇవ్వాలి



సాగు సజావుగా సాగాలంటే నీటి వనరుల తరువాత కావలసిందే యూరియా, ఎరువులు. ఇది లేకుండా పంట దిగుబడి సాగదు. వీలున్న చోటల్లా రైతులకు రైతు భరోసా కేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా అందుబాటులో ఉంచాలి. యూరియా కోసం రైతులు కడుపు మండి రోడ్డెక్కితే మంచిది కాదు. పంచాయితీ వ్యవసాయాధికారుల నుంచి జిల్లా అధికారుల వరకు యూరియా, ఎరువుల పంపిణీ సాఫీగా జరిగేటట్టు చర్యలు తీసుకోవాలి.

–కప్పల శ్రీనివాసరావు, పద్మనాభం

నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మహారాణిపేట: జిల్లాలో పాత రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ నెల 31వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వచ్చి స్మార్ట్ కార్డులను అందజేస్తారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 5,17,149 స్మార్ట్ కార్డులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి (డీఎస్‌వో) వి.భాస్కరరావు తెలిపారు. సెప్టెంబర్ నుంచి రేషన్ సరకులు పొందాలంటే ఈ కొత్త స్మార్ట్ కార్డు తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. ఒకవేళ గడువులోగా కార్డు అందని వారు తమ పరిధిలోని రేషన్ దుకాణానికి వెళ్లి వేలిముద్ర వేసి కార్డును పొందవచ్చు. చిరునామా మార్పులు, కుటుంబ సభ్యుల చేర్పులు–తొలగింపులు, ఆధార్ నంబర్ సవరణలు, కార్డుల విభజన వంటి పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించి, సరిచేసిన కార్డులను అందిస్తున్నట్లు డీఎస్‌వో వివరించారు. వలస వెళ్లిన లబ్ధిదారులు తమ కార్డును నమోదు చేసుకున్న రేషన్ దుకాణం వద్దే తీసుకోవాలని, అయితే రేషన్ తీసుకునేందుకు పోర్టబిలిటీ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని డీఎస్‌వో తెలిపారు. పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు గ్రామ, వార్డు స్థాయిలో ప్రత్యేక యాప్‌తో పాటు, డాష్‌బోర్డును కూడా ఏర్పాటు చేశామన్నారు.



పంపిణీకి సిద్ధం చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–3 పరిధిలోని టీపీ స్సార్ నుంచి హైలెవల్ రిజర్వాయర్‌కు నీటిని సరఫరా చేసే ప్రధాన పంపింగ్ మెయిన్‌లైన్‌లోని 450 ఎంఎం డయా పైప్‌లైన్ మరమ్మతులకు గురైంది. ఈ నేపథ్యంలో సోమవారం జోన్–3 పరిధిలోని పలు వార్డుల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం కలిగే ప్రాంతాలు

జోన్–3 పరిధిలోని 20వ వార్డు: ఈస్ట్‌పాయింట్ కాలనీ, పెదవాల్తేరు

21వ వార్డు: తమిళ్ స్ట్రీట్, విద్యానగర్ కాలనీ, రెల్లి వీధి, ఏయూ అవుట్‌గేట్ డౌన్, ఓల్డ్ సీబీఐ డౌన్, మైత్రీనగర్, వినయ్ నగర్ అపార్ట్‌మెంట్స్, స్విమ్మింగ్ పూల్ ఏరియా, పాండురంగాపురం, బీచ్‌రోడ్డు సబ్ మెరైన్, ఓషన్ వ్యూ లే అవుట్, చినవాల్తేరు

22వ వార్డు (పార్ట్): బాలాజీనగర్, టైమ్స్ ఆఫ్ ఇండియా, సిద్ధార్థనగర్

24వ వార్డు (పార్ట్): ఓల్డ్ రేసపువానిపాలెం, వినాయక నగర్, తులసిపేట, స్వర్ణభారతి స్టేడియం పరిసరాలు

27వ వార్డు: అశోక్‌నగర్, రామాటాకీస్ రోడ్డు, శ్రీనగర్, బుధిల్ పార్క్ రోడ్డు, రెడ్డి హాస్పిటల్ రోడ్డు, శ్రీనగర్ సాయిబాబా ఆలయం రోడ్డు, ద్వారకానగర్ రోడ్డు నంబర్ 1 నుంచి 6వ లైన్ వరకు, అమర్‌నగర్ చర్చి రోడ్డు, సీబీఎం కాంపౌండ్, రామాటాకీస్ లేడీస్ టికెట్ బుకింగ్ రోడ్డు

జోన్–4 పరిధిలోని 28వ వార్డు (పార్ట్): ఫేకర్స్ లేఅవుట్, కొలాసమెట్ట, రామ్‌నగర్ తదితర ప్రాంతాలు

డిఫెన్స్ మద్యం స్వాధీనం

మర్రిపాలెం: మురళీనగర్‌లోని గోపాలపట్నం ఎక్సైజ్ స్టేషన్ అధికారులు 24 డిఫెన్స్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్ఏడీ కొత్తరోడ్డులో నివాసముంటున్న ముదపాక శ్రీనివాస్ అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తున్నారనే సమాచారంతో ఆదివారం అధికారులు దాడులు చేశారు. శ్రీనివాస్ ఇంట్లో 24 మద్యం సీసాలు లభ్యం కావడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ కరుణలత, సిబ్బంది పాల్గొన్నారు.



మద్యం సీజ్ చేసిన ఎక్సైజ్ అధికారులు

రాగాల సంగమం

సంగీత ప్రియులను అలరించిన జుగల్బందీ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆరు రోజుల సంగీత, నృత్య, నాటక ఉత్సవాల్లో రెండో రోజు కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో కర్ణాటక సంగీతం, హిందుస్తానీ గాత్ర సంగీతం జుగల్బందీ జరిగింది. ముంబయికి చెందిన కర్ణాటక గాత్ర విదుషీమణి డాక్టర్ పూర్ణిమ కృష్ణన్, కోల్‌కతాకు చెందిన హిందుస్తానీ గాత్ర విదుషీమణి నిబేదిత భట్టాచార్య శ్రోతలను అలరించారు. పూర్ణిమ కృష్ణన్, నిబేదిత భట్టాచార్యల జుగల్బందీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. వారు హిందుస్తానీలోని 'యమన్' రాగాన్ని, కర్ణాటక సంగీతంలోని 'కల్యాణి' రాగాన్ని కలిపి 'శాఖీ ఏరీ అలీ పియా బిన్ రాగ్' అనే కృతిని ఆలపించారు. రాగాలాపన, స్వరకల్పనలతో ఈ జుగల్బందీ అందరినీ ఆకట్టుకుంది. కర్ణాటక శైలిలో 'రాగం తానం పల్లవి' విభాగంలో 'కల్యాణి' రాగంలో 'తారక బ్రహ్మ స్వరూపిణి తామరస విలోచని' అనే సాహిత్యంతో అద్భుతంగా గానం చేసి శ్రోతలను మైమరపించారు. కార్యక్రమంలో రియర్ అడ్మిరల్ ఓ. శ్రీనివాస్ , పూర్ణిమ శ్రీనివాస్ , అకాడమీ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్. రాజు, కార్యదర్శి డాక్టర్ గుములూరి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్, పిల్లా రమణమూర్తి పాల్గొన్నారు.

ఇంటర్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా అప్పారావు

మద్దిలపాలెం: విశాఖ ఉమ్మడి జిల్లా ఇంటర్మీడియట్ విద్యా ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. జీ.వి.అప్పారావు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బి.రామారావు ఉపాధ్యక్షుడిగా, బి.సి.హెచ్.సుధాకర్ కార్యదర్శిగా, కె.జగదీశ్వరరావు సంయుక్త కార్యదర్శిగా, బి.సుశీల మహిళా కార్యదర్శిగా, ఎస్.మురళీమోహన్ కోశాధికారిగా, కె.సిహెచ్.నాయుడు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఎం.దుర్గాప్రసాద్, ఎన్.గీతాకుమారి, బి.పుష్పకుమార్, సంతోష్ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఏపీఎన్జీవో అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి రవిశంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.అప్పలరాజు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. అల్లూరి, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల పరిధిలో ఇంటర్మీడియట్ విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ సంఘం సేవలందించనుందని నూతన అధ్యక్షుడు జీ.వి.అప్పారావు తెలిపారు.



ఎన్నికైన ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్జీవో అధ్యక్షుడు ఈశ్వరరావు

ఇండిగో చక్కర్లు



గోపాలపట్నం: వాతావరణం అనుకూలించకపోవడంతో హైదరాబాద్ నుంచి విశాఖపట్నం రావాల్సిన ఇండిగో విమానం దారి మళ్లించారు. సాయంత్రం 6.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకోవాల్సిన ఈ విమానం, బలమైన గాలుల కారణంగా ల్యాండ్ కాలేదు. దీంతో అధికారులు దానిని విజయవాడకు మళ్లించారు. ఈ సంఘటన వల్ల ప్రయాణికులకు కొంత అసౌకర్యం కలిగింది.

యువతికి ఆశ్రయం

అల్లిపురం: ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఒంటరిగా ఉన్న ఓ యువతిని ఆకతాయిల వేధింపుల నుంచి ఏయూటీడీ సిబ్బంది రక్షించారు. రాజాంకు చెందిన నాగవల్లి చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయింది. దీంతో ఆమె అమ్మమ్మ నాగవల్లిని కస్తూర్బా ఆశ్రమంలో చేర్పించారు. అక్కడ ఇంటర్ వరకు మాత్రమే ఉంది. దీంతో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన నాగవల్లిని, ఆశ్రమం నుంచి బయటకు పంపించారు. దీంతో నగరంలోని ఒక స్నేహితురాలి ఇంట్లో ఒక నెల రోజులు ఉంది. ఆమెకు పెళ్లి కావడంతో అక్కడి నుంచి కూడా బయటకు వచ్చింది. ఎక్కడికి వెళ్లాలో తెలియక ఆమె ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తలదాచుకుంది. అక్కడ కొందరు ఆకతాయిలు వేధిస్తుండగా.. కానిస్టేబుల్ నూకరాజును ఆశ్రయించింది. దీంతో ఆయన ఆమెను టీఎస్సార్ కాంప్లెక్స్ షెల్టర్‌కు తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆ యువతికి మహిళల వసతి గృహంలో ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.



యువతిని అప్పగిస్తున్న కానిస్టేబుల్ నూకరాజు

ఉక్కు కార్మికుల తొలగింపు దారుణం

మాజీమంత్రి అమర్‌నాథ్‌కు వైఎస్సార్‌టీయూసీ నాయకుల వినతి

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కార్మికుల తొలగింపు, వారి సంక్షేమంపై కోతలపై ఉక్కు వైఎస్సార్‌టీయూసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు వినతి పత్రం సమర్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు కార్మికులకు జీతాల్లో ఎలాంటి సమస్యలు లేవని, అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చాక హెచ్ఆర్ఏ, ఇన్సెంటివ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తొలగించారని నాయకులు తెలిపారు. వీఆర్ఎస్ పేరుతో కార్మికులను తొలగిస్తున్నారని, దాదాపు నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను ఇప్పటికే తొలగించారని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం భూములిచ్చిన నిర్వాసితులకు వైఎస్ రాజశేఖరరెడ్డి కల్పించిన శాశ్వత ఉపాధిని ఇప్పుడు తొలగించడం ఆందోళన కలిగిస్తోందని వారు పేర్కొన్నారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికుల స్థానంలో ఇతర రాష్ట్రాల కార్మికులను కొనసాగించడం దారుణమని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ విషయాలను జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని వారు అమర్‌నాథ్‌ను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు కర్రి దాలినాయుడు, డి.వి.రమణ, పేర్ల నూకరాజు, నల్ల శ్రీనివాస్, నమ్మి ప్రసాద్, త్రినాథ్‌రెడ్డి, చిత్రాడ బాలకృష్ణ, పాలిశెట్టి మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల ఆస్తులు రక్షించుకుందాం

రాధా మనోహర్ దాస్ స్వామి

డాబాగార్డెన్స్: హిందూ ఆలయాల ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా హిందూ న్యాయవాదుల సంఘం కృషి చేస్తుందని రాధా మనోహర్ దాస్ స్వామి అన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూ సంప్రదాయాలు, సంస్కృతులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చినా.. కొంతమంది వారసులు దేశంలో ఉండి భరతజాతిని చీల్చడానికి, సంపదను కొల్లగొట్టడానికి కుయుక్తులు పన్నుతున్నందున హిందువులు అభివృద్ధి చెందలేదన్నారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారులు అన్యమత ఉద్యోగులను గుర్తించి తొలగించడంలో ఉదాసీనత వహిస్తున్నారని ఆరోపించారు. హిందూ కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులను హిందూ న్యాయవాదుల సంఘం ఎదుర్కొంటుందని తెలిపారు. ఆలయాల ఆస్తులపై అధికార పార్టీ పెత్తనం చెలాయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాది శ్రీకృష్ణకుమార్ మాట్లాడుతూ హిందూ న్యాయవాదులను ఒకే వేదికపైకి తీసుకురావాలనే సంకల్పంతో 14 మంది స్వామీజీలు ఈ సంఘాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. సింహాచలం దేవస్థానం ఆస్తుల విషయంలో సమగ్ర న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 14న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమానికి హిందూ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కె.రవిశంకర్, డి.ఉమారాజ్యలక్ష్మి, వినోద్‌కుమార్, కె.సుబ్రహ్మణ్యం, వి.సురేఖ పాల్గొన్నారు.



పోస్టర్‌ఆవిష్కరిస్తున్న హిందూ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు, రాధా మనోహర్ దాస్ స్వామి

యువకులను కాపాడిన లైఫ్‌గార్డులు

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో ప్రమాదవశాత్తు సముద్రంలో కొట్టుకుపోయిన ఇద్దరు యువకులను లైఫ్‌గార్డ్స్ కాపాడారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన నలుగురు యువకులు సరదాగా గడిపేందుకు ఆదివారం మధ్యాహ్నం బీచ్‌కు వచ్చారు. స్నానం చేయడానికి సముద్రంలోకి దిగిన సమయంలో.. అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వారిలో శ్రీజిత్ జ్ఞాన్, బి.సర్కార్ అనే ఇద్దరు యువకులు లోపలికి కొట్టుకుపోయారు. అక్కడ విధుల్లో ఉన్న లైఫ్‌గార్డ్స్ ఎస్.నూకరాజు, ఎం.అమ్మోరు, చిన్నప్పన్న, చందు, సతీష్, దేవరాజ్ కుమార్ తక్షణమే స్పందించి, వారిని సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. అనంతరం మెరైన్ పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. పర్యాటకుల ప్రాణాలను కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.



యువకులతో లైఫ్‌గార్డ్స్

పెళ్లికి నిరాకరణ.. యువతి ఆత్మహత్య

మృతురాలు ఖమ్మం వాసి

అల్లిపురం: తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన ఓ యువతి నగరంలో ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివి. ఖమ్మం జిల్లా ఎర్రగడ్డకు చెందిన రమ్య (22) అదే ప్రాంతానికి చెందిన మేడా నరేష్‌తో కలిసి ఈ నెల 11న నగరానికి వచ్చారు. టూటౌన్ పరిధిలోని కొబ్బరితోటలో ఒక ఇంటిని రూ.2వేలకు అద్దెకు తీసుకున్నారు. ఈ క్రమంలో రమ్య.. తనను పెళ్లి చేసుకోవాలని నరేష్‌ను ఒత్తిడి చేసింది. అయితే నరేష్ 'నాకు పెళ్లి అయింది, నిన్ను పెళ్లి చేసుకోలేను. తిరిగి ఖమ్మం వెళ్లిపోదాం'అని రమ్యకు చెప్పాడు. దీనికి రమ్య అంగీకరించకపోవడంతో నరేష్ ఆమెను వదిలి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె శనివారం అర్ధరాత్రి గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు ఈ విషయాన్ని గుర్తించి టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. నరేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నేడు

మహారాణిపేట: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ అర్జీలను అందజేయాలని సూచించారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను కూడా వినియోగించుకోవాలన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆదివారం రైల్వే పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.50 వేల విలువైన 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు(జీఆర్పీ) తెలిపిన వివరాలివి.. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ ఎస్ఐ జె.కె.మీనా సిబ్బంది వివిధ ప్లాట్‌ఫారాలపై తనిఖీలు చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం, మైసూరు జిల్లాకు చెందిన రసూల్, సాధిక్ హుసేన్‌లు విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా బెంగళూరుకు గంజాయిని రవాణా చేస్తుండగా గుర్తించి, వారిని పట్టుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ ఎస్ఐ తెలిపారు.

టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక

అగనంపూడి: అనకాపల్లి జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలు ఆదివారం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. అనకాపల్లి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషులు, మహిళల జట్ల ఎంపిక కోసం ఈ పోటీలను నిర్వహించారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఎం.వి. నాగేశ్వరరావు, కార్యదర్శి జి. కనకారావు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చే నెలలో మండపేటలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో లంకెలపాలెం హైస్కూల్ హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, అసోసియేషన్ ప్రతినిధులు రవి, సూర్యనారాయణ, తరుణ్, రాణి, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో వసతి వెతలు

- బాలికలకు వసతి కొరత
- హాస్టల్ సీట్లు 50.. డిమాండ్ వందల్లో..
- రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగం
- దూరప్రాంత డిప్లొమా విద్యార్థినుల అవస్థలు

మురళీనగర్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో సరైన వసతి సదుపాయం సరిగ్గా లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 9 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో చాలామంది దూరప్రాంతాల నుంచి వచ్చి విద్యాభ్యాసం చేస్తున్నారు. వసతి గృహాలు అందుబాటులోకి రాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా బాలికలు వసతి సమస్యను ఎదుర్కొంటున్నారు.

అరకొరగా.. వసతి

ఉమ్మడి విశాఖలో కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్), పెందుర్తి, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం , చోడవరం, భీమిలి బాలికలు, పాడేరులో గవర్నమెంట్ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో చాలా కాలేజీల్లో హాస్టల్ సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలోని 9 ప్రభుత్వ కాలేజీల్లో

- భీమిలి మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో బాలికలకు వసతి సదుపాయం ఉంది.
- పాడేరు ప్రభుత్వ ఆదర్శ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌లో బాలురకు మాత్రమే హాస్టల్ సదుపాయం ఉంది. నర్సీపట్నంలో హాస్టల్ భవనం ఉన్నా.. కోవిడ్ తర్వాత మూసేశారు. హాస్టల్ నిర్వహణకు ప్రత్యేక సిబ్బంది ఉన్నప్పటికీ దీని నిర్వహణను పట్టించుకోలేదు.
- ఇక అనకాపల్లి, చోడవరం, పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలల్లో వసతిగృహాలే లేవు. దీంతో అక్కడ కాలేజీ దూరప్రాంత విద్యార్థులు చేరినా బయట వసతి వెదుక్కోవాల్సిన పరిస్థితి.
- కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బాలురకు మాత్రమే స్టూడెంట్స్ మేనేజిమెంట్ హాస్టల్ ఉంది. ఈ హాస్టల్‌లో 350మంది వరకు బాలురకు అవకాశం కల్పిస్తున్నారు.
- విశాఖపట్నంలోని కంచరపాలెం పాలిటెక్నిక్ ప్రాంగణంలో బాలికల కోసం ప్రత్యేకంగా వసతి గృహాన్ని రూ.కోట్లు వెచ్చించి నిర్మించినా అందుబాటులోకి తేవడంలో సాంకేతిక విద్యాశాఖ విఫలమైంది. ఈ కాలేజీలో 500మందికి పైగా బాలికలు చదువుతున్నారు. పాలిటెక్నిక్‌లో 100మంది వరకు వసతి కల్పించే విధంగా భవనం నిర్మించినా ఏళ్ల తరబడి నిరుపయోగంగానే ఉండటంతో విద్యార్థినులు వసతి కోసం ఇబ్బంది పడుతున్నారు.
- ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్)లో వుమెన్స్ హాస్టల్‌ను టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు ప్రారంభించారు. ఇక్కడ 50 మంది విద్యార్థులకు వసతి కల్పించారు. అయితే, ఇక్కడ ప్రత్యేక సిబ్బంది లేకపోవడంతో విద్యార్థినులకు రక్షణగా కాలేజీ సిబ్బందిని వినియోగిస్తున్నారు. ప్రభుత్వ పరంగా ప్రత్యేక సిబ్బంది, సెక్యూరిటీకి ప్రత్యేక చర్యలు తీసుకోకపోయినా వీరు హాస్టల్‌ను నడుపుతున్నారు. వీరికి సమీపంలోని పాలిటెక్నిక్ బాలుర హాస్టల్ నుంచి భోజనాలు తీసుకువస్తున్నారు. భోజనాలు తీసుకురావడానికి ఆటో చార్జీలను విద్యార్థులే భరిస్తున్నారు. 'గైస్' కాలేజీ హాస్టల్‌కు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి ఇక్కడే భోజనం వండి అందించే ఏర్పాట్లు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



విశాఖపట్నం పాలిటెక్నిక్‌లో నిరుపయోగంగా ఉన్న బాలికల హాస్టల్ భవనం



భవనం చుట్టూ పరిసరాలు ఇలా..

పెరుగుతున్న డిమాండ్

ఈ ఏడాది ఎక్కువ మంది విద్యార్థులు హాస్టల్‌లో ఉండి చదువుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే డిమాండ్‌కు తగిన విధంగా హాస్టల్ సీట్లు లేవు. గైస్‌లో నాలుగు కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచీల్లో ఏయూ రీజియన్‌తో పాటు ఎస్వీ యూనివర్సిటీ రీజియన్‌కు ప్రత్యేకంగా కొన్ని సీట్ల రిజర్వేషన్ ఉంటుంది. దీంతో ఎస్వీయూ పరిధి జిల్లాల నుంచి బాలికలు ఎక్కువగా ఈ కళాశాలలో చేరుతున్నారు. పాలిటెక్నిక్ కాలేజీలోనూ ఎస్వీయూ పరిధిలోని విద్యార్థులు చేరారు. దీంతో వీరు కాలేజీ హాస్టల్‌లోనే ఉండాలని అభిలషిస్తున్నారు. గైస్ హాస్టల్‌లో కేవలం 50 సీట్లు మాత్రమే ఉన్నాయి. డిమాండ్ వంద మందికి పైగా ఉంది. మిగతా వారికి క్యాంపస్ హాస్టల్‌లో వసతి కల్పించలేని పరిస్థితి నెలకొంది. పాలిటెక్నిక్ కాలేజీ బాలికలకు కూడా ఇక్కడ వసతి కల్పిస్తున్నారు. దీని వల్ల ఇతర దూర ప్రాంత జిల్లాల బాలికలకు వసతి కల్పించలేకపోతున్నారు. ముఖ్యంగా ఫస్టియర్ విద్యార్థులకు వసతి కొరత ఉంది. కంచరపాలెం పాలిటెక్నిక్ ప్రాంగణంలో నిర్మించిన భవనాన్ని అందుబాటులోకి తీసుకువస్తే సుమారు వంద మందికి వసతి కల్పించేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థినులకు వసతి సమస్య తీరుతుంది. ఆ దిశగా సాంకేతిక విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



విద్యార్థులు